క్లుప్తంగా

గూడ్స్ ఆటో ఢీకొని విద్యార్థి మృతి

గొల్లప్రోలు (పిఠాపురం మండలం): గూడ్స్ ఆటో ఢీకొని పదో తరగతి విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొండెంపూడి నాగ త్రినాథ్ (14) అతడి స్నేహితుడి ఇంటికి వెళ్లేందుకు బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో నడుస్తూ వెళ్తున్నాడు. ఎ.విజయనగరం గ్రామంలోని చెరువు మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన గూడ్స్ ఆటో (ఏపీ39డబ్ల్యూఎన్ 0391) అతడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో త్రినాథ్ తలకు ఎడమవైపు తీవ్ర రక్తగాయమై, అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా, హారన్ మోగించకుండా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు తండ్రి నందేశ్వరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

అమలాపురం రూరల్: మండలం బండారులంక శివారు శిరిడి సాయిబాబా ఆలయ సమీపంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లమిల్లి చెందిన యువకుడు బద్రి శ్రీకాంత్ (33) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. తాలూకా ఎస్సై చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్ తాపీ మేస్త్రి. దసరా ఉత్సవాల ఊరేగింపుల నేపథ్యంలో రవణం మల్లయ్య వీధిలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి మంగళవారం సాయంత్రం వచ్చాడు. రాత్రంతా స్నేహితులతో కలసి దసరా ఉత్సవాల ఫ్లెక్సీలను కట్టారు. తెల్లవారుజామున అల్పాహారం తీసుకునేందుకు బండారులంకలో ఉన్న హోటల్‌కు స్నేహితుడు రాచకొండ శివతేజతో కలసి మోటారు సైకిల్‌పై వచ్చారు. తిరిగి అమలాపురం వెళ్తుండగా శిరిడీ సాయి ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక ఉన్న శ్రీకాంత్ తలకు బలమైన గాయం కాగా, శివతేజ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే అతడు అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలిన గాయాలతో వృద్ధురాలు..

అనపర్తి: కాలిన గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మంగళవారం బిక్కవోలు మండలం వూలపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల మేరకు స్థానిక శ్రీహరిరావు పేటకు చెందిన చెల్లుబోయిన నూకమ్మ (72) 19వ తేదీ సోమవారం మధ్యాహ్నం కాలిన గాయాలతో ఇంట్లో పడి ఉన్నట్టు ఆమె మనవడు సూర్య శివ కేశవకు స్థానికులు ఫోన్ చేశారు. దీంతో అతడు వెంటనే ఇంటికి వెళ్లి ఆమెను ఏమైందని అడిగాడు. ఆమె ఏమీ చెప్పలేకపోయింది. చుట్ట తాగే అలవాటు ఉన్న ఆమెపై నిప్పురవ్వలు పడి ప్రమాదం జరిగి ఉంటుందని భావించి చికిత్స నిమిత్తం బిక్కవోలు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి, మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె మనవడు కేశవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై ఫిర్యాదు

పెద్దాపురం: ఒక పక్క ఎన్నికలు జరుగుతుండగా మరోపక్క కూటమి నేతల సహకారంతో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి రాత్రికి రాత్రే షెడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. స్థానిక పాండవుల మెట్ట సమీపంలో రాజమహేంద్రవరం వెళ్లే మార్గంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమిస్తున్నారని పట్టణ వైఎస్సార్ సీపీ నాయకుడు పలివెల జనార్ధన్ మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

నిబంధనలను తొక్కేసి..

అధికారం చేతిలో ఉంటే దేనినైనా మార్చేయవచ్చు.. నిబంధనలను పక్కన బెట్టేయచ్చని కూటమి నేతలు నిరూపిస్తున్నారు.. ఎన్నికల వేళ కోడ్‌ను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు.. ప్రతిపక్ష పార్టీకి సవాలక్ష నిబంధనలు పెట్టి ఇబ్బంది పెడుతున్న అధికారులు, ఈ కోడ్ ఉల్లంఘనులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.



అనుమతి లేకుండా బైక్ ర్యాలీగా ఎంపీటీసీ నామినేషన్లకు వస్తున్న టీడీపీ నాయకులు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్‌లో అధికార పార్టీ నాయకులు నిబంధనలకు పాతర వేశారు. అనుమతులు లేకుండా భారీ బైక్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో తొలిరోజే మండలంలోని టీడీపీ నాయకులు ఆ పార్టీ జెండాలను కట్టుకుని బైక్ ర్యాలీ చేపట్టారు. సర్పవరం గ్రామం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ కొనసాగింది. వీరంతా ఇటీవలే టీడీపీ కండువాలు వేసుకున్నారు. సర్పంచ్ పదవి కోసం టీడీపీ పక్షాన చేరిన చందు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడంతో అనుమతి లేకపోయినా, సర్పవరం పోలీసులు నిలువరించలేదు. మరోవైపు చందు తీరు కూటమి భాగస్వామ్య పార్టీ జనసేనకు మింగుడు పడడం లేదు. జనసేన, టీడీపీ మధ్య సీట్ల పంపకం తేలక ముందే సర్పవరంలోని నాలుగు ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ నుంచి నామినేషన్లను వేయించడంతో జనసేన నాయకులు గుర్రుగా ఉన్నారు.

ఇదేం వివక్ష?



ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్‌లో ఇప్పటికీ ముసుగు వేయకుండా ఉన్న టీడీపీ జెండా దిమ్మ

ఆత్రేయపురం: స్థానిక ఎన్నికల కోడ్ అమలులో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఆత్రేయపురం మండలంలో ఎక్కడపడితే అక్కడ ఉన్న పసుపు రంగు దిమ్మలు, ఫ్లెక్సీల తొలగింపులో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ర్యాలి గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన దివంగత మహనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాత్రం కోడ్ అమల్లోకి రావడంతోనే ముసుగు వేసేశారు. ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్లో ఇప్పటికీ టీడీపీ దిమ్మకు ముసుగు వేయలేదు. అధికారులు వివక్ష చూపకుండా ఎన్నికల కోడ్ అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ అత్యుత్సాహం!



ద్వారకాతిరుమలలో ఎస్సై సుధీర్‌తో వాగ్వాదానికి దిగిన టీడీపీ నేతలు

ద్వారకాతిరుమల: ఎన్నికల నామినేషన్ల తొలిరోజు టీడీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్న పోలీసులపై వాగ్వాదానికి దిగారు. ఆ వివరాల్లోకి వెళితే.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల నేపథ్యంలో ద్వారకాతిరుమల ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి సుమారు 100 అడుగుల దూరంలో పోలీస్ స్టేషన్ సమీపాన రహదారిపై బారికేడ్లు పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై టి.సుధీర్ సిబ్బందితో పర్యవేక్షణ చేపట్టారు. నామినేషన్ వేసే అభ్యర్థులు, వారి ఇద్దరు ప్రతిపాదకులు, డమ్మీ అభ్యర్థులను మాత్రమే లోపలకు అనుమతించారు. ఈ క్రమంలో పంగిడిగూడెం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు అక్కడికి చేరుకున్నాయి. దీంతో అక్కడికి వచ్చిన కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ అభ్యర్థులతో పాటు మాజీ ఎంపీపీ, మరో బీసీ సామాజికవర్గ నాయకుడిని ఎలా అనుమతించారంటూ పోలీసులను నిలదీశారు. వారు అభ్యర్థుల ప్రతిపాదకులని ఎస్సై, సిబ్బంది స్పష్టం చేసినా ఏమాత్రం తగ్గకుండా వాగ్వాదానికి దిగారు. ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా పోలీసులు తీసుకున్న చర్యలపై ఇలా అభ్యంతరం వ్యక్తం చేయడం అక్కడున్న వారిని విస్మయానికి గురిచేసింది.

'కోడ్' వర్తించదా



అంబాజీపేట: పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్ ప్రహరీపై పల్లె పండుగ అంటూ పవన్ కళ్యాణ్ వాల్ పోస్టర్ దర్శనమిస్తుంది. ఇది పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. అధికార పార్టీ చెందిన వారికి ఎన్నికల్ కోడ్ వర్తించదా? లేక అధికారుల నిర్లక్ష్యమా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని అనుసరించి విశాఖపట్నం –సికింద్రాబాద్ మధ్య ఈ నెల 22, 26 తేదీల మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. విశాఖపట్నం–సికింద్రాబాద్ (08517) 22, 25 (గురు, ఆదివారాల్లో) తేదీల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. సికింద్రాబాద్ విశాఖపట్నం (08518) 23, 26 (శుక్ర, సోమవారాల్లో) తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని ఈ రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

పండగ వేళ విషాదం

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి



ఘటనా స్థలంలో మృతి చెందిన పల్లాల రమణారెడ్డి



అశోక్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

చింతూరు: దసరా పండగ అందరి ఇళ్లలో సరదా నింపితే.. ఆ రెండు ఇళ్లలో రోదనలు.. కన్నీటి ప్రవాహాలను పారించింది. మేనత్తకు కొత్త దుస్తులు ఇచ్చి తిరిగి వస్తూ ఒకరు.. ఏదో పనిపై వెళ్తూ మరొకరు వారి వారి వాహనాలపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొని మృతి చెందారు. వివరాల్లోకి వెళితే మండలం పోతనపల్లి సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో సుకుమామిడికి చెందిన పల్లాల రమణారెడ్డి (40), చూటూరుకు చెందిన పాయం అశోక్ (26) మృతిచెందారు. చింతూరు మండలం ఎర్రంపేటలో అరకు కాఫీ దుకాణం నిర్వహిస్తున్న రమణారెడ్డి పండగకని తన మేనత్తకు కొత్త దుస్తులు ఇచ్చేందుకు బైక్‌పై స్వగ్రామం సుకుమామిడి వెళ్లి తిరిగి వస్తుండగా చింతూరు వైపు నుండి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న చూటూరుకు చెందిన పాయం అశోక్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రమణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా అశోక్‌ను చింతూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఎస్ఐ సంతోష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిపాలవీధి ఊరేగింపులో అగ్నిప్రమాదం

- కిరోసిన్ డబ్బాలతో ఉన్న వ్యాన్ దగ్ధం
- ఇద్దరికి తీవ్ర గాయాలు



అగ్ని ప్రమాదంలో ఎగసి పడుతున్న మంటలు

అమలాపురం టౌన్: దసరా ఊరేగింపుల్లో మహిపాల వీధిలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించడంతో ఉత్సవ కమిటీ పెద్దలు ఆందోళనకు గురయ్యారు. స్థానిక వెంకటేశ్వర దేవస్థానం సమీపంలో 216 జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడి స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఊరేగింపులో చెడి తాలింఖానా ప్రదర్శనల్లో ఉపయోగించే అగ్గి బరాటాల కోసం ఉపయోగించే కిరోసిన్‌ను డబ్బాలలో నింపి వ్యాన్‌లో తరలిస్తుండగా ఓ తారాజువ్వ వచ్చి పడింది. దీంతో వ్యాన్‌లో మంటలు చెలరేగినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్తున్నారు. ఈ ప్రమాదంలో కిరోసిన్‌తో వస్త్రాలు అందించే వ్యక్తులు మోర్త శ్రీనివాసరావు, గోసంగి రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరికి శరీరంపై పలుచోట్ల కాలిన గాయాలయ్యాయి. వ్యాన్ నుంచి మంటలు ఎగిసి పడడంతో జనం బెంబేలెత్తారు. మంటల ధాటికి పక్కనే ఉన్న ఓ రేకుల గోడ స్వల్పంగా దెబ్బతింది. అమలాపురం అగ్నిమాపక దళం, ఊరేగింపు నిర్వాహకులు మంటలను అదుపు చేశారు.

తెల్లరాయి తరలిస్తున్న లారీల పట్టివేత



పట్టుబడిన తెల్లరాయి లారీలు

ఎటపాక: అనుమతులు లేకుండా తెల్లరాయి తరలిస్తున్న రెండు లారీలను అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. మండల పరిధిలో నెల్లిపాక జాతీయ రహదారిపై ఉన్న అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తెల్లరాయితో చింతూరు మండలం గూడూరు నుంచి వస్తున్న రెండు లారీలను గుర్తించి నిలిపివేశారు. వాహనాల డ్రైవర్ల వద్ద ఎటువంటి అనుమతులు లేకపోవడంతో లారీలను పురుషోత్తపట్నంలోని నెల్లిపాక రేంజ్ కార్యాలయానికి తరలించారు. తెల్లరాయి లారీల సమాచారాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేసినట్లు రేంజర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. తెల్లరాయిని గూడూరు నుంచి తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లికి తరలిస్తున్నట్లు తెలిపారు.

వరుడైన 'వైకుంఠనాథుడు'!

- చిన్న తిరుపతిలో ప్రారంభమైన దివ్య బ్రహ్మోత్సవాలు
- గజ వాహనంపై గోవిందుడి విహారం



భూ సమేత మహావిష్ణువుగా దర్శనమిస్తున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: కలియుగ వైకుంఠనాథుడు కొలువైన చిన్నతిరుపతి క్షేత్రంలో శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి, అమ్మవార్లను వరుడు, వధువుగా చేసే వేడుక అట్టహాసంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై నిత్య కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి అలంకరించారు. ఆలయ ఈఓ సతీమణి భాగ్యలక్ష్మి స్వామి, అమ్మవార్లకు పూలు, పండ్లు, అర్చకులు, పండితులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాత్రి గజవాహనంపై స్వామివారి తిరువీధి సేవ వైభవంగా సాగింది. ఆలయ ముఖ మండపంలో స్వామివారు శ్రీ భూ సమేత మహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం డీఈఓ వై.భద్రాజీ, ఏఈఓ పి.నటరాజారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 9 గంటలకు ధ్వజారోహణ, అనంతరం హంసవాహన సేవ నిర్వహించనున్నారు.



అమ్మవారిని, శ్రీవారిని వధూవరులను చేస్తున్న అర్చకులు

తిరుగు ప్రయాణం అవస్థల మయం

- బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపు
- నకాలానికి రాకపోవడంతో ఇబ్బందులు
- నిర్వహణలో అధికారుల అలసత్వం



రాజమహేంద్రవరం కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: బస్సులు సమయ వేళలు పాటించకపోవడంతో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. దసరా సెలవులు ముగియడంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల ఆలస్యంతో బుధవారం తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి నడుస్తున్నాయి. పండగ రద్దీ దృష్ట్యా సరిపడినన్ని బస్సులు నడపడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించినప్పటికీ ఆచరణలో కనిపించడం లేదని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు.

తిరుగు ప్రయాణాలకు 100 ప్రత్యేక బస్సులు

దసరా పండగకు వచ్చిన ప్రయాణికుల తిరుగు ప్రయాణాలకు వంద ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీపీటీఓ మనోహర్ తెలిపారు. రాజమహేంద్రవరం డిపో 70, కొవ్వూరు 10, నిడదవోలు 10, గోకవరం డిపో 10 బస్సులను ఆదివారం వరకు నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు

దసరా ఆదాయం రూ.34 లక్షలు

దసరా సందర్భంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాలకు నడిపిన 150 ప్రత్యేక బస్సుల ద్వారా సుమారు రూ.34 లక్షల ఆదాయం లభించిందని డీపీటీఓ మనోహర్ తెలిపారు. 70 వేల కిలోమీటర్లు రాకపోకలు సాగించిన ఈ బస్సుల్లో 25 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరినట్టు వెల్లడించారు.

విశ్రాంత ఉపాధ్యాయిని ఇంట్లో చోరీ

అనపర్తి: స్థానిక విశ్రాంత ఉపాధ్యాయిని ఇంట్లో జరిగిన చోరీలో దుండగులు నగదు, నగలు దోచుకుపోయారు. స్థానిక వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో నివసిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయిని బేబీ తల్లి ఇంట్లో బుధవారం రాత్రి జరిగిన చోరీలో సుమారు రూ.3 లక్షల నగదు, 50 గ్రాముల బంగారు ఆభరణాలు దోపిడికి గురైనట్టు చెబుతున్నారు. ఈ విషయమై ఎస్సై వినయ్ ప్రతాప్‌ను వివరణ కోరగా ఎన్నికల విధుల్లో ఉన్నందున ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

కోటసత్తెమ్మకు బంగారు గొలుసు సమర్పణ



ఆలయ అధికారులకు బంగారు గొలుసు అందజేస్తున్న దాత నాగదుర్గారావు కుటుంబ సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువైన కోటసత్తెమ్మ తల్లికి దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన యర్రంశెట్టి నాగదుర్గారావు రూ.2 లక్షలు విలువచేసే 16 గ్రాముల బంగారు గొలుసును బుధవారం సమర్పించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ అధికారులు సన్మానించి అమ్మవారి చిత్ర పటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ కె.లలిత తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై కొండచిలువ హల్‌చల్



మోరంపూడిలో చెట్టుపైకి ఎగబాకుతున్న కొండచిలువ

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్ శివారు బుచ్చియ్యనగర్‌కు వెళ్లే దారిలో ఒక చెట్టుపై మంగళవారం రాత్రి ఒక భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. రోడ్డు పక్కన ఉండే చెట్టుపై కొండచిలువ కనపడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కొండచిలువ కదులుతున్న దృశ్యాలను చిత్రీకరించి వైరల్ చేశారు. మోరంపూడి పరిసర ప్రాంతాల్లో గుట్టలు, చెట్లు ఉండడంతో కొండచిలువల సంచారానికి అనువుగా ఉంటాయని నగరానికి చెందిన స్నేక్ క్యాచర్ ఈశ్వర్ తెలిపారు.

24న డీఎస్‌పీలో ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఈనెల 24న జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడాంశాల్లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శులు పి.శ్రీనివాస్, శేషకుమారి బుధవారం తెలిపారు. స్థానిక డీఎస్‌ఏలో బాస్కెట్‌బాల్, రైఫిల్ షూటింగ్, హాకీ, హ్యాండ్‌బాల్, కూరాష్ ఎంపికలు జరగుతాయన్నారు. క్రికెట్ అండర్–17 బాలుర ఎంపికలు అంబాజీపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో, నెట్‌బాల్ అండర్ 14, 17 బాల బాలికల ఎంపికలు రావులపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో, ఫెన్సింగ్ అండర్–14, 17 బాల బాలికలు ఎంపికలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జెడ్పీహెచ్‌ఎస్ మోరి లో జరుగుతాయని, ఆసక్తి గల వారు జిల్లా స్థాయి ఎంపికలకు హాజరుకావాలని వారు కోరారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా | అమలాపురం బ్రాంచి
Bank of Baroda
3-3-80, కె. అగ్రహారం, అమలాపురం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఏ.పి-533201. ఈమెయిల్: amalap@bankofbaroda.bank.in, ఫోన్: 08856 238080

స్థిరాస్తి విక్రయం కొరకు అమ్మకం నోటీసు

అనుబంధం-IV-ఎ (రూల్ 6(2) & 8(6) చూడవలెను)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) & 8(6) లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు) కు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా / చార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తిరిగి వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను **"ఎక్కడ ఏది ఉన్నదో", "అది ఎలా ఉన్నదో అలా"** మరియు **"అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు)/ సెక్యూర్డ్ అస్సెట్స్(లు)/బకాయిలు/రిజర్వ్ ధర /ఈ-వేలం తేదీ & సమయం, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1. మెస్సర్స్ గ్రీన్ ట్రీ హోస్పిటాలిటీ, ప్రొప్రయిటర్: గుండబత్తుల ఆదినారాయణ రావు, డి.నెం. 46-10-14/14/1, మెయిన్ రోడ్, ప్రకాష్ నగర్ రోడ్, దానవాయిపేట, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533103. 2. శ్రీ గుండబత్తుల ఆదినారాయణరావు, తండ్రి: విజయ కుమార్, దోర్ నెం. 4-1-12, అబ్బిరెడ్డి వీధి, అమలాపురం, అమలాపురం మండలం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా-533201. 3. శ్రీ గుండబత్తుల విజయ కుమార్, తండ్రి: ఆదినారాయణ రావు, దోర్ నెం. 4-1-12, అబ్బిరెడ్డి వీధి, అమలాపురం, అమలాపురం మండలం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా-533201.

మొత్తం బకాయిలు: రూ. 1,93,38,605.01/- (అక్షరాలా ఒక్క కోటి తొంభై మూడు లక్షల ముప్పై ఎనిమిది వేల ఆరు వందల ఐదు రూపాయలు మరియు ఒక పైసా మాత్రమే) + అప్లై చేయని వడ్డీ + అందించని వడ్డీ + 10.03.2026 నుండి ఏవైనా ఇతర ఛార్జీలు ఉంటే అవి మరియు వసూలు అయ్యే వరకు ఛార్జీలు ఏవైనా ఉంటే అవి.

స్థిరాస్తి యొక్క వివరములు

ఐటమ్ నెం: 1: సర్వే నెం: 484/6ఎ, విస్తీర్ణ ప్రాంతం: గ్రామ ఖాతం, ఎకరా 0.16 సెంట్లు అనగా 774.40 చదరపు గజాల స్థలం మరియు దోర్ నెం. 4-1-12 కలిగిన బిల్డింగ్, స్థానం: కోనసీమ జిల్లా, అమలాపురం ఎస్.ఆర్.ఓ, అమలాపురం, అబ్బిరెడ్డి వీధి. హద్దులు: తూర్పు: అబ్బిరెడ్డి సూర్య నారాయణరావు మరియు కుమారులు గారి ఇల్లు, పడమర: ఆర్లపల్లి వెంకటరావు వీధి, ఉత్తరం: అబ్బిరెడ్డి సూర్య నారాయణరావు గారి స్థలం, దక్షిణం: రోడ్డు.

ఈ-వేలం తేది & సమయం: 26-11-2026, మ॥ 02.00 గం॥ల నుండి సా॥ 06.00 గం॥ల వరకు

రిజర్వ్ ధర, ఈఎండీ మరియు బిడ్ పెంపు మొత్తం: రూ. 2,12,15,000/- (కనిష్టంగా)

ఆస్తి తనిఖీ తేదీ & సమయం: 25.11.2026 తేది మధ్యాహ్నం 3.00 గంటలకు

స్వాధీనత స్థితి (నిర్మాణాత్మకంగా / భౌతికంగా): భౌతిక స్వాధీనం (13(4) తర్వాత)

అమ్మకం యొక్క ఫూర్తి నియమ నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్‌సైట్ లింక్: https://bankofbaroda.bank.in/e-auction.htm మరియు ఆన్‌లైన్ ఆక్షన్ పోర్టల్ https://baanknet.com నందు చూడగలరు. అర్హత గల బిడ్డర్లు అధీకృత అధికారి యొక్క మొబైల్ నెం. +91 8469015151 నందు సంప్రదించవచ్చును.

ప్రదేశం: అమలాపురం, తేదీ: 21.10.2026 అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

కాలువలో మహిళ మృతదేహం లభ్యం

ఆత్రేయపురం: మండలంలోని ఊబలంక ప్రధాన పంట కాలువలో మహిళ మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానిక ఎస్సై ఎస్.రాము తెలిపిన వివరాల మేరకు అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన వాసంశెట్టి గంగారత్నం మూడో కుమార్తె మామిడిశెట్టి పద్మావతికి లక్ష్మీ పోలవరానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. భర్తతో వచ్చిన విభేదాల నేపథ్యంలో ఆమె మర